ప్రజాశక్తి
శుక్రవారం 9 డిసెంబర్ 2022
5
విజయనగరం

సఖి కార్యక్రమంపై నేడు సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో అమలు జరుగుతున్న సఖి కార్యక్రమంపై శుక్రవారం సదస్సు నిర్వహిస్తున్నట్టు యునిసెఫ్ సంస్థ కన్సల్టెంట్ శివకిషోర్ కందుకూరి తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ తో కలసి యునిసెఫ్ సంస్థ నగరంలోని ఎస్‌విఎన్ లేక్ ప్యాలెస్ లో నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. కలెక్టర్ ఎ.సూర్యకుమారి, వైద్యులు, నోడల్ ఎంఎస్‌కెలు, బాలల సంరక్షణ కమిటీ సభ్యులు, సిడిపిఒలు, విద్యాశాఖాధికారులు ఈ సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు. జిల్లాలో ప్రస్తుతం సఖి కార్యక్రమం జరుగుతున్న తీరును సమీక్షించి ముందుకు వెళ్లడంపై ఈ సదస్సులో చర్చిస్తామని పేర్కొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల్లో ఆందోళన

తొలగింపు ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పదేళ్ల సర్వీసు లోబడిన ఉద్యోగులను తొలగించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో జిల్లాలోని ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. పనికి తగ్గవేతనాలు మంజూరు చేస్తామంటూ అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఏరుదాటాక తెప్పతగలబెట్టిన చందంగా వ్యవహరిస్తోందని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్క్స్ అండ్ అకౌంట్స్ విభాగంలో పదేళ్లలోపు సర్వీసు గల ఉద్యోగుల తొలగింపు ఉత్తర్వులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ ఉత్తర్వులు కేవలం ఆ విభాగానికి మాత్రమే పరిమితం కాదని, భవిష్యత్తులో అన్ని శాఖలు, ప్రాజెక్టుల్లోనూ అమలు చేసే ప్రమాదం లేకపోలేదని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్య, వైద్యారోగ్యం, రెవెన్యూ, ట్రెజరీ తదితర ప్రభుత్వ శాఖలు, ఎపిఇపిడిసిఎల్, డ్వామా, సమగ్ర శిక్ష వంటి ప్రభుత్వ రంగ సంస్థల్లో సుమారు 5వేల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరంతా తమను పర్మినెంట్ చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈలోపు పనికి తగ్గవేతనం అమలు చేయాలని చాలా కాలంగా పోరాడుతున్నారు. గత ఎన్నికల ముందు సిఎం జగన్మోహన్ రెడ్డి చేపట్టిన పాదయాత్రలో పనికి తగ్గవేతనాలు ఇస్తామని, కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక వేతనాలు మొక్కుబడిగా పెంచారు. మూడు కేటగిరిల్లో ఉన్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు గత ప్రభుత్వ హయాంలో 8వేల వేతనం పెంచితే, ఈ ప్రభుత్వం రూ.2,700 నుంచి రూ.3వేల లోపే పెంచింది. మరోవైపు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తెల్లరేషన్ కార్డులు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు, పింఛన్లు వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలకూ దూరం చేసింది. ఈ సమస్యలతో సతమతమవుతున్న నేపథ్యంలో తాజాగా సర్కారు చేసిన నిర్ణయం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతోపాటు వారి కుటుంబ సభ్యులనూ కలవరపాటుకు గురిచేస్తోంది. మరోవైపు తొలగింపు ఉత్తర్వులపై అధికార పార్టీ సజ్జల రామకృష్ణారెడ్డి ప్రకటనలోనూ స్పష్టత లేదని కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ యూనియన్ నాయకులు పేర్కొన్నారు.

జిఒను రద్దుచేయాలి

వర్కర్స్ అండ్ అకౌంట్స్ ఎంప్లాయీస్ తొలగింపుపై ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే రద్దుచేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. ఆ జీవోను రద్దుచేయకుండా ఉద్యోగుల తొలగింపు చర్యలు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు ప్రకటించడం మోసకారి చర్య. ఉత్తర్వుల్లో ఒకమాట. నోటితో మరో మాట చెప్పడం మాటలు చెప్పడం సరికాదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందర్నీ భర్తీచేయాలి. లేకపోతే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

- కాంతారావు,
కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్, టీచర్ అండ్ వర్కర్స్ జెఎసి జిల్లా చైర్మన్

జిల్లాకు ఇంటిగ్రేటెడ్ మెడికల్ ల్యాబ్

- రూ.1.25 కోట్లు మంజూరు
- ఎక్కడ ఏర్పాటు చేయాలన్న దానిపై సమాలోచన
- ఏరియా ఆస్పత్రులను పరిశీలించిన అధికారుల బృందం

ఎస్.కోట ఏరియా ఆస్పత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న అధికారుల బృందం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాకు అధునాత ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ మెడికల్ ల్యాబ్ మంజూరైంది. ప్రధాన మంత్రి అభిన్ పేరిట రూ.1.25కోట్ల నిధులు కేటాయించారు. ఈ లేబొరేటరీని ఎక్కడ ఏర్పాటు చేయాలన్న దానిపై సమాలోచన చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ స్టేట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మోహన్ కృష్ణ, ఎపి హెల్త్ సిస్టమ్ స్టేట్ కన్సల్టెంట్ డాక్టర్ విజయ్ రాజానాతో కూడిన అధికారిక బృందం ఎస్.కోట, రాజాం ఏరియా ఆసుపత్రులను గురువారం సందర్శించింది. అంతకు ముందుకు జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి, ఇసుపత్రుల సేవల సమన్వయ అధికారి డాక్టర్ నాగభూషణరావులను వేర్వేరుగా కలిసి చర్చించారు. అన్ని జిల్లాల్లోనూ కేంద్రాసుపత్రుల్లోనూ ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ మెడికల్ ల్యాబ్‌లను ప్రభుత్వం మంజూరు చేసింది. మన జిల్లా కేంద్రాసుపత్రిని మెడికల్ కాలేజీకి అప్పగించిన నేపథ్యంలో ఇందులో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బందిని ఎపి వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యాన నడుస్తున్న ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లకు బదిలీ చేసిన సంగతి తెలిసిందే. ఇక్కడి ల్యాబ్ కూడా మెడికల్ కాలేజీ పరిధిలోకి వెళ్లింది. ఈనేపథ్యంలో జిల్లా కేంద్రాసుపత్రి అంటూ ఇప్పటి వరకు ప్రత్యేకంగా లేదు. దీంతో, లేబొరేటరీ ఎక్కడ ఏర్పాటు చేయాలన్నదానిపై అధికారులు సమాలోచన చేస్తున్నారు. జిల్లా కేంద్రాసుపత్రి లేకపోవడం వల్ల ఏదో ఒక ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేయాలని అధికార యంత్రాంగం భావిస్తోంది. లేబొరేటరీ ఏర్పాటుకు కనీసం 500స్వేర్ ఫీట్స్ భవనం తప్పనిసరిగా ఉండాలి. ఈనేపథ్యంలో ఎస్.కోట, రాజాం ఆసుపత్రుల్లో వసతి సౌకర్యం, అక్కడ ఒపి స్థాయిని పరిశీలించేందుకు అధికారులు సందర్శించారు. రెండు చోట్లా లేబొరేటరీ ఏర్పాటుకు అనువుగా ఉంటుందని అభిప్రాయపడినట్టు సమాచారం. ఇక్కడ ఉన్న పరిస్థితిని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే కీలక నిర్ణయం చేయనున్నట్టు తెలిసింది.

జిల్లాలోగల ఏరియా ఆస్పత్రుల్లో ఈ తరహా లేబొరేటరీని ఏర్పాటు చేయాలని, తద్వారా గ్రామీణ ప్రాంతంలో సేవలు మరింతగా అందుబాటులోకి తేవాలని భావిస్తున్నారు. ఈ పబ్లిక్ మెడికల్ ల్యాబ్ అందుబాటులోకి వస్తే బిపి, సుగర్, హెచ్‌బి, థైరాయిడ్ వంటి సాధారణ పరీక్షలతోపాటు సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్, ఎండోస్కోపీ వంటి వైద్యపరీక్షలు కూడా అందుబాటులోకి రానున్నాయి.

సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఒ గణపతిరావు

9 నుంచి శాఖాపరమైన పరీక్షలు

ప్రజాశక్తి-విజయనగరం

ఈనెల 9 నుంచి 14 వరకు శాఖాపరమైన పరీక్షలు జరగనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు పేర్కొన్నారు. జిల్లాలో మూడు కేంద్రాల్లో జరగనున్న పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై గురువారం తన ఛాంబర్లో వివిధ శాఖల అధికారులు, పరీక్షా కేంద్రాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. అందరూ సమన్వయంతో వ్యవహరించి పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, తగిన చర్యలు తీసుకోవాలని డిఆర్ఒ ఆదేశించారు.గాజులరేగలోని సత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ కళాశాలలో, ఐయాన్ డిజిటల్ లో, బొబ్బిలి స్వామి వివేకానంద కళాశాలలో 12 దశల్లో పరీక్షలు జరుగుతాయని తెలిపారు.ఈ సందర్భంగా పరీక్షల షెడ్యూల్‌ను వివరించారు. 9 నుంచి 14వ తేదీ వరకు ఆబ్జెక్టివ్ విధాన పరీక్షలు మూడు కేంద్రాల్లోనూ జరుగుతాయని, డిస్క్రిప్టవ్ పరీక్షలు బొబ్బిలి స్వామి వివేకానంద కళాశాలలో మాత్రమే జరుగుతాయని తెలిపారు. పరీక్షలు ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. ప్రత్యేక కేటగిరీ కిందకు వచ్చే అభ్యర్థులకు అదనంగా మరో గంట సమయం కేటాయిస్తామని తెలిపారు. సమావేశంలో పరీక్షల విభాగం సూపరింటెండెంట్ మహేశ్, ఎపిపిఎస్‌సి ప్రతినిధులు, వివిధ విభాగాల అధికారులు, పరీక్షా కేంద్రాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రోత్సాహం

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల
జోనల్ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సిఎం ప్రైజ్ మనీ కప్ ద్వారా ముఖ్యమంత్రి వైస్ జగన్ మోహనరెడ్డి క్రీడలకు ఎంతో ప్రోత్సాహన్ని అందిస్తున్నారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ప్రైజ్ మనీ కోసం ప్రభుత్వం రూ.50లక్షలు కేటాయించినట్లు తెలిపారు. జోనల్ స్థాయి సిఎం ప్రైజ్‌మనీ కప్ బ్యాడ్మింటన్ పోటీలను స్థానిక డిఎస్ఎ ఇండోర్ స్టేడియంలో గురువారం కోలగట్ల ప్రారంభించారు. తొలుత క్రీడాకారుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ పోటీల్లో విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, అనకాపల్లి, పాడేరు తదితర జిల్లాల క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. క్రీడా పోటీలను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించిన అనంతరం కోలగట్ల మాట్లాడుతూ, ప్రభుత్వం క్రీడా రంగానికి అత్యధిక ప్రాధాన్యత నిస్తోందని అన్నారు. సిఎం ప్రైజ్‌మనీ కప్ ద్వారా కబడ్డీ, బ్యాడ్మింటన్, క్రికెట్, వాలీబాల్ క్రీడల్లో జిల్లా స్థాయి, జోనల్ స్థాయి, రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్రీడలతో శారీరక ధారుఢ్యంతోపాటు, మానసిక వికాసం కూడా కలుగుతుందని చెప్పారు. క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు, ఉద్యోగాల్లో క్రీడాకారుల కోటాలను కూడా భర్తీ చేస్తూ, క్రీడాప్రతిభ ఉన్నవారికి అన్ని రకాలుగా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా అత్యుత్తమ ప్రతిభను చూపించి, జిల్లాకు, మన జోన్‌కు మంచిపేరు తేవాలని కోలగట్ల ఆకాంక్షించారు. జగనన్న క్రీడా సంబరాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చీఫ్ కోచ్ అప్పలనాయుడు, బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి కుసుమ బచ్చన్, సిటీ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ విఎస్ ప్రసాద్, క్రీడా సంఘాల నాయకులు ఎంబికె, రమణ, శ్రీను, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న కోలగట్ల

క్రీడాకారులనుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న డిప్యూటీ స్పీకర్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు

2కె వాక్‌ను ప్రారంభిస్తున్న యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు

సిపిఎస్ రద్దు చేసేవరకూ పోరాటం

2కె వాక్‌లో యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-జామి

సిపిస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఉపాధ్యాయలు 2 కిలోమీటర్ల వాక్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ముందు పాదయాత్రలో సిపిఎస్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చిన జగన్మోహన్‌రెడ్డి మాట తప్పి మడపతిప్పారని అన్నారు. సిపిఎస్‌ను రద్దు చేసిఉద్యోగులకు సామాజిక భద్రత కల్పించాలని, సిపిఎస్ రద్దు తప్ప మరే ప్రత్యామ్నాయం లేదని అన్నారు. రాజ్యాంగ బద్ధంగా కల్పించిన పెన్షన్‌ను ప్రభుత్వాలు రద్దు చేయడం దుర్మార్గమని అన్నారు. సిపిఎస్‌ను రద్దు చేయాలని, ముఖ్యమంత్రి హామీలను నెరవేర్చాలని నినాదాలు చేశారు. సిపిస్ రద్దు చేయకపోతే భవిష్యత్ పోరాటాలను ఉధృతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు రాజారావు, వాసుదేవరావు, రమేష్ నాయుడు, ఎం.తాతం నాయుడు, వెంకటరావు, దేముడు బాబు, అప్పలరాజు, మహిళా

సబ్బుల యూనిట్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

జిసిసి కార్మికుల నిరసన

స్థానికంగానే పని కల్పించాలని సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిసిసి సోప్ యూనిట్ కార్మికులు గురువారం జిసిసి యూనిట్ వద్ద ధర్నాచేశారు.ఈసందర్భగా సిఐటియు నాయకులు ఎ.జగన్మోహన్ మాట్లాడుతూ విజయనగరం సోప్ యూనిట్‌లో సబ్బులు అమ్మేడు పోక ఉత్పత్తి నిలిచిపోయిందని, . డిటర్జెంట్ యూనిట్ కూడా మరమ్మతులు చేయని కారణంగా నడవడం లేదని తెలిపారు.దీంతో ఇక్కడ పనిచేస్తున్న 16 మంది కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. జిసిసి యాజమాన్యం సాలూరు, పార్వతీపురం జెసిసి డిపోల వద్దకు కార్మికులను బదిలీ చేయడంతో మరింత ఇబ్బందులు పెరిగాయన్నారు. నెల జీతం రాను పోను ఛార్జీలకు, సాధారణ ఖర్చులకు కూడా సరిపోవడం లేదన్నారు. స్థానికంగానే పని కల్పించాలని అడిగితే కార్మికులనే స్టాల్స్ ఏర్పాటు చేసుకొని జిసిసి ఉత్పత్తులను అమ్మాలని యాజమాన్యం చెబుతోందన్నారు. ఫ్యాక్టరీ నడిచేంతవరకు లే ఆఫ్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు సంతు, రమణమ్మ, భారతి తదితరులు పాల్గొన్నారు.

పోటీతత్వాన్ని పెంచాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించే దిశగా విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి సూచించారు. విద్యా కమిటీ ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులకు పరీక్షలు కన్నా ముందు మోడల్ పరీక్షలు నిర్వహిస్తే మంచిదని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గురువారం తన ఛాంబర్‌లో ఎంఇఒ రాజు, నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్కారు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించే దిశగా వినూత్న కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.అవసరమైన స్టడీ మెటీరియల్ కూడా అందించితే మంచిదని సూచించారు.సమావేశంలో విద్యా కమిటీ సభ్యులు తాళ్లపూడి సంతోషికుమారి పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం

అధ్యక్షులు చిరంజీవిని అభినందిస్తున్న సభ్యులు

ఉత్తరాంధ్ర గ్రామీణవైద్యుల సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం స్థానిక పి ఎస్ ఆర్ కాంప్లెక్స్‌లో జరిగింది. ఆ సంఘం విజయనగరం శాఖ వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషీ , సలహాదారు మమ్ముల తిరుపతి, మన్యం జిల్లా మంగరాజు సమక్షంలో జరిగిన ఎన్నికల్లో జిల్లా అధ్యక్షులుగా గెద్ద చిరంజీవి, కార్యదర్శిగా కోట్ల పైడిరాజు, కోశాధికారిగా ఉమా శంకర్, ఉపాధ్యక్షులుగా రామ్మూర్తిరాజు, ముత్యాల రావు, సహాయ కార్యదర్శులుగా బి.గౌరినాయుడు, మక్కువ రమణ, సమాచార కార్యదర్శి కర్రి సత్యం నారాయణ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఫెడరేషన్ కార్యవర్గ సభ్యులు వి గౌరినాయుడు అల్లాడ త్రినాథ రావు పాల్గొన్నారు.

11న మిజోరం గవర్నర్ రాక

గురుదేవ్ ఛారిటబుల్ ట్రస్టులో కేన్సర్ ఆస్పత్రికి శంకుస్థాపన

ప్రజాశక్తి-విజయనగరం

ఈనెల 11వ తేదీన మిజోరం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు కొత్తవలస రానున్నట్లు శ్రీ గురుదేవా ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ ఆర్.జగదీష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ట్రస్టులో జరిగే వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు, గవర్నర్ ఆదివారం ఉదయం 11 గంటలకు ట్రస్టుకు చేరుకుంటారని, 11.10కి వంద పడకల కేన్సర్ ఆస్పత్రికి (పేలియేటివ్ క్రిటికల్ కేర్‌సెంటర్) శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన అత్యాధునిక ఆర్థోపెడిక్ ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభించి, అనంతరం జరిగే సభలో పాల్గొంటారని జగదీష్ తెలిపారు.

ఇళ్లున్న చోటే పట్టాలివ్వాలని ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక కంటోన్మెంట్ బొగ్గుల దిబ్బ వద్ద నివాసం ఉంటున్న దళితులు, పేదల ఇళ్లు కూల్చేస్తామని వెంటనే ఖాళీ చెయ్యాలని స్థానిక కార్పొరేటర్ వత్తిడి చేయాడాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధర్యంలో గురువారం కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు మాట్లాడుతూ బొగ్గుల దిబ్బ వద్ద నివాసముంటున్న దళితులు, పేదలకు జీవో నెంబర్ 225 ప్రకారం 100 గజాలు రిజిస్ట్రేషన్ చేసి ఇళ్ల పట్టా ఇవ్వాలన్నారు. ఇక్కడే పట్టాలిచ్చి ఇళ్లు కట్టాలని డిమాండ్ చేశారు. 120 కుటుంబాలలో 50 ఇళ్లకి సారిపల్లి వద్ద టిడ్కో ఇళ్లు మంజూరు అయ్యాయని, అక్కడికి వెళ్లి పోవాలని వత్తిడి చేస్తున్నారన్నారు. వాస్తవానికి సారిపల్లి వద్ద టిడ్కో ఇళ్లు మంజూరు చేయని వారు ఎక్కడికి పోవాలో కార్పొరేటర్ సమాధానం చెప్పాలన్నారు. ప్రస్తుతం ఉన్న చోటే ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు తగిన స్థలం ఉన్నది కావున తక్షణమే వెంటనే పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. అనతరం కమిషనర్‌కు వినతి అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.రమణమ్మ, కెవిపిఎస్ నాయకులు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న బాధితులు, సిపిఎం నాయకులు

క్రీడాకారులను అభినందిస్తున్న జెఎన్‌టియు ప్రిన్సిపాల్ తదితరులు

పరుగు పందెంలో జెఎన్‌టియు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియు గురజాడ విద్యార్థులు 400 మీటర్ల రిలేలో ప్రతిభ కనబరిచారు. ఈనెల 2,3తేదీలలో జెఎన్‌టియుకె అనుబంధ కళాశాలైన ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజ్ (సూరంపాలెం)లో నిర్వహించిన సెంట్రల్ జోన్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ లో జెఎన్‌టియు గురజాడ విజయనగరం విద్యార్థులు 4X400 మీటర్ల రిలేలో బంగారు పతకం సాధించారు. పి. నీరజ్ (మెకానికల్), కె. సుమంత్ (ఇఇఇ), ఎమ్. డెన్సీ సెఫిన్ (ఇసిఇ), పి.పవన్ కుమార్ (సిసిసి), హైజంప్ మహిళల విభాగంలో బి. గాయత్రీ (మెకానికల్) కాంస్య పతకం సాధించారు. వీరిని జెఎన్‌టియు ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీకుమార్, స్పోర్ట్స్ కోర్డినేటర్ ఎ.వి. పాపారావు, పీడీ నాగరాజు అభినందించారు. వారందరికీ క్రీడాదుస్తులను అందజేసారు.

ఫెన్సింగ్ క్రీడాకారులకు అభినందనలు

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అభినందించారు. ఇప్పటికే ఖోఖో, కబడ్డీ క్రీడల్లో జిల్లాకు ఎంతో ఖ్యాతి ఉందని, ఫెన్సింగ్‌లో కూడా క్రీడాకారులు రాణించడం అభినందనీయమని అన్నారు. జాతీయ స్థాయి పోటీల్లో కూడా విజేతలుగా నిలిచి, జిల్లాకు మంచి పేరు తేవాలని కోలగట్ల కోరారు. కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-14 ఫెన్సింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన ఎ.రుత్విక్, సిహెచ్ ఛరిష్మా విజేతలుగా నిలిచారు. వీరు కేరళ లో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొననున్నారు. అండర్ విభాగంలో విజేతలుగా నిలిచిన కె.పవన్‌కుమార్, కె.లక్ష్మీనారాయణ, మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగే జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొననున్నారు.

నేడు తైక్వాండో,రెజ్లింగ్, పెన్సింగ్ జట్లు ఎంపిక

స్థానిక విజ్జి మైదానంలో శుక్రవారం తైక్వాండో, రెజ్లింగ్, పెన్సింగ్ జట్ల ఎంపిక అండర్ 17,19 విభాగంలో జరుగుతాయని స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎల్ వి రమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెజ్లింగ్ ఎంపిక కొండగుంపాం జెడ్‌పి హైస్కూల్ మైదానంలో జరుగనుందని తెలిపారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

బిసిలకు పెద్దపీట వేసింది మేమే : ఎమ్మెల్యే

గజపతినగరం: బిసిలకు పెద్దపీట వేసింది వైసిపి మాత్రమేనని ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయవాడలో నిర్వహించిన జయహో బిసి సభ విజయవంతమైందని, ఈ కార్యక్రమంతో రాబోయే ఎన్నికల్లో మొత్తంగా 175 సీట్లు వైసిపి గెలుస్తుందనే పూర్తి నమ్మకం ఏర్పడిందని అన్నారు. బిసిలు అంటే వెనుకబడిన కులాలు కాదు రాష్ట్ర అభివృద్ధికి వెన్నెముక అని గుర్తించిన ఏకైక వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. బిసిల అభివృద్ధిని, జయహో బిసి సభ విజయవంతాన్ని చూసి ఓర్వలేని స్థానిక ప్రతిపక్ష నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా రోడ్డు నిర్మాణ పనులపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. త్వరలో ప్రారంభం కానున్న బైపాస్ రోడ్డు భూ సేకరణలో తన భూమి పోతున్నప్పటికీ అధికారులకు సహకరిస్తున్నానని అన్నారు. ముందుగా డ్రైన్స్ నిర్మించాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించామని అన్నారు. ఈ సమావేశంలో పిఎసిఎస్ అధ్యక్షులు కరణం ఆదినారాయణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వేమలి ముత్యాల నాయుడు, ఎంపిపి, సర్పంచ్ బెల్లాన త్రినాధరావు, వైసిపి నాయకులు మండల సురేష్, కర్రి నానాజీ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

పూసపాటిరేగ : మండలంలోని జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆపార్టీ మండల అధ్యక్షులు జలపారి అప్పడుదొర తెలిపారు. గురువారం స్థానిక జనసేన కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకూ రెండు వర్గాలు ఉండేవని, ఇప్పుడైతే అంతా ఒకే వర్గమన్నారు. ఎవరైతే అసంతృప్తిగా ఉన్నారో వారందరితో మాట్లాడామన్నారు. మాకు పదవులు ముఖ్యం కాదని పార్టీ కోసం పనిచేస్తామని తెలిపారు. ముఖ్యంగా స్థానిక సమస్యలపై పోరాడి పరిష్కరించే దిశగా పనిచేయాలని నిర్ణయించామన్నారు. పార్టీని మరింత పటిష్ఠంగా ప్రజల్లోకి తీసుకువెలతామన్నారు. సమావేశంలో ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ తుమ్మి లక్ష్మీరాజ్, నియోజకవర్గ సీనియర్ నాయకులు బుర్లె విజయశంకర్, రాష్ట్ర మత్స్యకార విభాగం నాయకులు కారి అప్పలరాజు, కె.రమేష్, బి.జానకిరామ్, దుక్క అప్పలరాజు, మాదేటి ఈశ్వరరావు, లెంక సురేష్, బూర సతీష్, పిన్నింటి అప్పలనాయుడు, కిలారి రమేష్, ప్రమోద్, పవన్ తదితర పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రిసోర్స్ పర్సన్

ఎంవిజిఆర్‌లో అవగాహన సదస్సు

డెంకాడ: చింతలవలస ఎంవిజిఆర్‌లో గురువారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో 'ప్రతికూల భావోద్వేగాలకు వ్యసనం నుండి బయటపడటం' అనే అంశంపై ప్రేరణాత్మక అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశం సంస్థ నుంచి రిసోర్స్ పర్సన్ దీపక్ జీ, గీతం యూనివర్శిటీ వైద్యులు ఎస్వీఐ రెడ్డి పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు సమస్యను పరిష్కరించే శక్తిని కలిగి ఉండాలన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులకు కోపం, విచారం, ఆందోళన, నిరాశ వంటి భావోద్వేగాలను ఎలా నియంత్రించాలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వైవిఎస్ శేఖర్, డీన్ ఆఫ్ స్టూడెంట్స్ ఎస్. మోహన్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్. షణ్ముఖరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు, సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అందుబాటులో కొనుగోలు కేంద్రాలు

విజయనగరం : జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు అందుబాటులోనే ఉన్నాయని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. బుధవారం ప్రజాశక్తిలో ప్రచురితమైన 'ధాన్యం కొనేవారేరీ' కథనానికి ఆయన స్పందించారు. జిల్లా మొత్తంగా 510 రైతు భరోసా కేంద్రాలు, 65 ప్రాథమిక సహకార సంఘాలు, 20 రైతు సంఘాల సంస్థలు ద్వారా ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లాలో గతనెల 15నే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని తెలిపారు. రైతులకు గోనెసంచులను ఆర్‌బికెల ద్వారా సరఫరా చేస్తున్నామని తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ఆర్‌బికెల్లోనే ధాన్యం విక్రయించాలని తెలిపారు.

నవరత్నాలతో ప్రతిఒక్కరికీ మేలు

శృంగవరపుకోట : నవరత్నాలతో ప్రతి ఒక్కరికీ మేలు జరుగుతుందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వెంకటరమణ పేట గ్రామ సచివాలయ పరిధిలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదరణకు నోచుకోని వితంతువులు, ఒంటరి మహిళలు, వృద్ధులు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల పట్ల చాలా సానుకూల దృక్పథంతో ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, స్టేట్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, పిఎసిఎస్ చైర్మన్ సాధుబాబు, పోతనాపల్లి వెంకటరావు, ఎస్.కోట వైస్ సర్పంచ్ మోపాడ కుమార్, ఎఎంసి డైరెక్టర్ పార్వతి, స్థానిక సర్పంచ్ రామ కోటి, ఎంపిటిసి రామచంద్రుడు, ఆవాల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

నెల్లిమర్ల : మండలంలోని మొయిద ఉన్నత పాఠశాలలో 1983 -84 ఏడాదికి చెందిన పూర్వ విద్యార్థులు గురువారం ఒకే వేదికపై కలిశారు. తాము చదువుకున్న ఉన్నత పాఠశాలలో అందరూ కలిసి సందడి చేశారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఉత్సాహంగా ఉల్లాసంగా కలిసి ప్రస్తుతం మొయిద పాఠశాలలో కలిసి తిరిగారు. ఉపాధ్యాయులతో కలిసి అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మద్దిల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు 1983 -84 పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రణాళికలతోనే సుస్థిర పాలన

రేగిడి : గ్రామ పంచాయతీల ప్రణాళికలతోనే సుస్థిర పాలన అందించవచ్చునని ఎంపిడిఒ గన్నవరపు కాశీ విశ్వనాథరావు అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ఇఒపిఆర్‌డి నాగభూషణరావు, ఎటిఎం మంగమ్మ, సీనియర్ సహాయకులు గోవిందరావు, అన్ని శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

మెరకముడిదాం: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం ఎంపిపి కృష్ణవేణి ఆధ్వర్యంలో గ్రామాభివృద్ధికి ప్రణాళిక తయారీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐద రోజులు పాటు నిర్వహించనున్న ఈ శిక్షణా కార్యక్రమాన్ని సర్పంచులు, ఎంపిటిసిలు వినియోగించుకోవాలని కోరారు.

'మిరాకిల్'లో ప్రత్యేక ఓటర్ల నమోదు

భోగాపురం : మండలంలోని మిరాకిల్ కళాశాలలో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని గురువారం బిఎల్వోలు నిర్వహించారు. కళాశాలలో చదువుతున్న ఎంబిఎ, ఎంసిఎ, బిటెక్ విద్యార్థులకు ఓటు హక్కు నమోదు చేశారు. కళాశాల ప్రిన్సిపల్ కే.అర్జునరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ త్రినాధ రావు, ఆర్ఐ కిషోర్, విఆర్ఒ ఉషారాణి, శ్రీనివాస్, వాణి, స్వర్ణలత, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి కోసం మహిళల నిరసన

బొబ్బిలి : పట్టణంలోని అమ్మిగారి కోనేరు ప్రాంతానికి ఆరు రోజులుగా తాగునీరు సరఫరా చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్న కుళాయి వద్ద మహిళలు ఖాళీ బిందెలు, బకెట్లతో నిరసన తెలిపారు. ఆరు రోజులుగా తాగునీరు సరఫరా చేయకపోతే ఎలా జీవించేదని మహిళలు ప్రశ్నిస్తున్నారు. తాగునీరు సరఫరా చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేయకపోతే మంచినీటి ట్యాంకులతో సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

పాముకాటుతో రైతు మృతి

మృతుడు సత్యం

లక్కవరపుకోట : మండలంలోని పిల్ల అగ్రహారం గ్రామానికి చెందిన రైతు పాముకాటుకు గురై గురువారం మృతి చెందారు. ఇందుకు సంబంధించి మృతుని సోదరుడు జగ్గన్నదొర తెలిపిన వివరాల ప్రకారం. పిల్లఅగ్రహారానికి చెందిన రైతు కరెడ్ల సత్యం (57) తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో కోసిన వరి చేను కుప్పపెట్టేందుకు భుజంపై వరి కంకులను పట్టుకుని వస్తుండగా అందులో ఉన్న పాము నుదుటిపై కాటేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య జగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక ఎఎస్ఐ యువరాజు మృతదేహానికి సవపంచినామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం శృంగవరపుకోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రాష్ట్రానికి పట్టిన కర్మ వైసిపి

వంగర: సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కోండ్రు మురళి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రాష్ట్రానికి పట్టిన కర్మ వైసిపి అని దీన్ని వదిలించు కోవాలని టిడిపి నియోజవర్గ ఇంచార్జి, మాజీ మంత్రి పతివాడ నారాయణ స్వామి నాయుడు అన్నారు. గురువారం నగర పంచాయతీలోని10వ వార్డులో టిడిపి పట్టణ అధ్యక్షులు బైరెడ్డి లీలావతి ఆధ్వర్యంలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన ఇంఛార్జి పతివాడ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్రోతు బంగార్రాజు, మండల పార్టీ అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్ మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత విపరీతంగా నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయన్నారు. విద్యుత్, బస్ ఛార్జీలు పెంచి అధికార వైసిపి ప్రజలను దోచుకు తింటుందని విమర్శించారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించలేదని, గృహ నిర్మాణాల్లో అక్రమాలు, సంక్షేమ పథకాల్లో కోత విధించి అర్హులకు మొండి చేయి చూపిస్తున్నారన్నారు. అన్ని రంగాల్లో అధికార వైసిపి విఫలమైంది కాబట్టి రాష్ట్రానికి పట్టిన కర్మను వచ్చే ఎన్నికల్లో వదిలించుకోవడానికి ప్రజలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, స్పోర్ట్స్ వర్గన్ లెంక అప్పల నాయుడు, తారక రామా నాయుడు, సీనియర్ నాయకులు బైరెడ్డి నాగేశ్వర రావు, టిడిపి పట్టణ అధ్యక్షులు బైరెడ్డి లీలావతి, టిడిపి కౌన్సిలర్లు నరవ రామ లక్ష్మీ, లెంక హైమవతి, ముదు మంచి లక్ష్మీ నాయకులు బొంతు వెంకట రమణ, అట్టాడ శ్రీధర్, కాళ్ల లక్ష్మీ, పొదుగు కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

వంగర : వైసిపి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను గ్రామాల్లో ప్రజలకు తెలియజేసి టిడిపి బలోపేతానికి కృషి చేయాలని మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్ అన్నారు. 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా రాజాం మండలం శ్యాంపురంలో వంగర మండల నాయకులు, కార్యకర్తలతో ఆయన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుండి నిత్యవసర వస్తువుల ధరలు పెంచేసి పేదలు నడ్డి విరుస్తున్నారని అన్నారు. నిరుద్యోగ సమస్య పెరిగిపోయిందని మహిళలకు భద్రత లేకుండా పోయిందన్నారు. ఇసుక, మద్యం రేట్లు ఇష్టానుసారంగా పెంచేసి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేదల డబ్బును నిస్సిగ్గుగా దోసుకుంటున్నారని ఆరోపించారు. అనంతరం టిడిపి వంగర మండల అధ్యక్షులుగా పిన్నింటి మోహనరావు, ప్రధాన కార్యదర్శిగా బలిజిరెడ్డి శ్రీను, ఉపాధ్యక్షులుగా ఉత్తరావల్లి చిరంజీవి నాయుడు, తెలుగు యువత అధ్యక్షునిగా బెజ్జిపురం రవిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు లచ్చుబుక్క కృష్ణమూర్తి, బొడ్డోటు శ్రీనివాసరావు, బొరోతు రాంబాబు, ఎలకల దుర్గబాబు, ఎ. వెంకట నాయుడు, వేగిరెడ్డి కృష్ణ సింహచలం తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం: ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని మండలంలోని రాజాపులోవలో గురువారం రాత్రి నిర్వహించారు. టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి పతివాడ నారాయణస్వామి నాయుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్రోతు బంగార్రాజు, మండల పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రారంభించారు. గ్రామంలో ప్రతి ఇంటికి తిరిగి వైసిపి ప్రభుత్వం చేస్తున్న అవినీతిని, ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న పరిస్థితులను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పతివాడ అప్పలనాయుడు, దాసరి అప్పలస్వామి, పిడుగు తోటరావు, నీలాపు అప్పలరామిరెడ్డి, కోరాడ తాతారావు, కర్రోతు రాజు, సరగడ తోగలు రెడ్డి, రాజపులోవ ఎంపిటిసి కిలారి కొండమ్మ, కిలారి రాము, రీసు రమణ తదితరులు పాల్గొన్నారు.

మహిళల పట్ల గౌరవంతో మెలగాలి

ప్రజాశక్తి - కొత్తవలస

మహిళలు పట్ల గౌరవంతో మెలగాలని ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ అన్నారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో లింగ వివక్ష, దిశా, లైంగిక వేధింపులుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సమాజంలో పెరుగుతున్న రుగ్మతలను రూపుమాపేందుకు కృషి చేయాలన్నారు. నేటి సమాజంలో అన్ని రంగాల్లో ముందున్న మహిళలు వేధింపులకు గురికావడం విచారకరమని అన్నారు. ఎస్ఐ దేవి మాట్లాడుతూ మహిళలు తరచుగా పురుషుడు చేతిలో లైంగిక వేధింపులకు గురి కావడం విచారకరమని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని రంగాల్లో మగవారితో సమానంగా మహిళలు కూడా రాణిస్తున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ రొంగలి ఉమాదేవి, అంగన్వాడీ సూపర్ వైజర్లు కె.రమణమ్మ, జి.కామేశ్వరి, పి.భాగ్యలక్ష్మి, వి.రామకృష్ణమ్మ, పాల్గొన్నారు.

శృంగవరపుకోట: లింగ సమానత్వం అనేది ప్రాథమిక మానవ హక్కుని శృంగవరపుకోట వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు అన్నారు. గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన 'లింగ వివక్షతకు ఇక ముగింపు' కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడార. లింగ సమానత్వం అనేది ప్రాథమిక మానవ హక్కు మాత్రమే కాదని, శాంతియుత, సంపన్నమైన, స్థిరమైన ప్రపంచానికి అవసరమైన పునాది అని ఆమె అన్నారు. లింగ సమానత్వంలో పిల్లల వైఖరిని రూపొందించడంలో తల్లిదండ్రుల తర్వాత ఉపాధ్యాయులు ముఖ్య పాత్ర పోషించాలని, జెండర్ రోల్స్ పట్ల పిల్లల ప్రవర్తనలో మార్పులు తీసుకురావడానికి టీచర్ల శిక్షణ కచ్చితంగా సహాయపడుతుందని అన్నారు. మహిళల హక్కులను ప్రోత్సహించే సామాజిక మార్పును తీసుకురావడానికి విద్య అత్యంత శక్తిమంతమైన సాధనాల్లో ఒకటని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి మమ్ములూరి విజయలక్ష్మి, సర్పంచ్ గనివాడ సంతోషికుమారి, ఎంపిటిసిలు మజ్జి దేవి, బొడ్డేటి ఆదిలక్ష్మి, వార్డు మెంబర్లు భారతి, ఎర్రమ్మ, గౌరీశ్వరి, ఐసిడిఎస్ ఉద్యోగులు, అంగన్వాడీ, ఆశా వర్కర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తవలస: ర్యాలీ చేస్తున్న ఎంపిపి, తదితరులు

గంట్యాడ: మండలంలోని లక్కిడాం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, కరకవలస గ్రామంలోని ఇందిరా క్రాంతి పదం ఆధ్వర్యంలో గురువారం లింగ నిర్ధారిత వివక్షతకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాలను చేపట్టారు. బాల్య వివాహాలను జరిపించిన వారిపై చట్ట ప్రకారం కఠిన శిక్షలు అమలు చేయడం జరుగుతుందని అన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞలు చేయించారు. ఈ కార్యక్రమంలో లక్కిడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాక చిన్నంనాయుడు, ఉపాధ్యాయులు, ఎపిఎం శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న దాసరి లక్ష్మి

ఏకతాటిపైకి రావాలి

వేపాడ : అరకులో గురువారం జరిగిన విశాఖ, అరకు ఉమ్మడి జిల్లాల ఎస్టి జోన్ వన్ సమావేశంలో మండలానికి చెందిన రాష్ట్ర టిడిపి ఎస్టి సెల్ ఉపాధ్యక్షులు దాసరి లక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్టిలకు ఈ ప్రభుత్వం అన్యాయం చేస్తుందన్నారు. ఇప్పటికైనా ఎస్టిలంతా ఏకతాటిపైకి వచ్చి ఈ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. దీనిపై అందరూ స్పందించాలని ఆమె కోరారు. అనంతరం ఎస్టిల అభివృద్ధికి రానున్న రోజుల్లో చేపట్టవలసిన కార్యక్రమాల గురించి చర్చించారు.

గోప్యంగా నిర్మాణ పనులు ?

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండల పరిషత్ కార్యాలయంలో గోప్యంగా నిర్మాణ పనులు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఇప్పుడున్న గదులు చాలవన్నట్టు అదనంగా మరో గదిని నిర్మించాలని ఓ అధికార పార్టీ నాయకుడి సూచనల మేరకు నిర్మిస్తున్నట్లు తెలిస్తోంది. ఇప్పటికే ఈ నిర్మాణానికి కావలసిన సామాగ్రిని ఏర్పాటు చేసినట్టు తెలిసింది. వాస్తవానికి పంచాయతీరాజ్ శాఖ నిధుల నుండి రూ. 30 లక్షల వ్యయంతో 2006లో ఈ భవనాన్ని నిర్మించారు. అప్పట్లోనే అధికారుల సమావేశ హాల్‌తో పాటు ఎంపిపి చాంబర్, ఎంపిడిఒ చాంబర్, దిగువ స్థాయి అధికారులకూ సరిపడినన్ని గదులను పూర్తిస్థాయిలో నిర్మించారు. ఇప్పుడు మరో ప్రజా ప్రతినిధికి కూడా కార్యాలయంలో ప్రత్యేక గది ఉండాలనే ఉద్దేశంతో నిర్మాణ పనులు చేపడుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఉన్న గదులు సరిపోతున్నా ఇంకో గది కోసం ప్రజా ధనాని వృధా చేయడాన్ని పలువురు ఆక్షేపిస్తున్నారు. ఇందుకు సంబంధించి స్థానిక ఎంపిడిఒ కె రూపేష్‌ను వివరణ కోరగా కార్యాలయంలో మరో గదికి నిర్మాణం పనులు చేసేందుకు తనకు ఎటువంటి ఆదేశాలు రాలేదన్నారు. తప్పనిసరి నిర్మాణ పనులు చేయవలసి వస్తే ఉన్నతాధికారుల ఆదేశాలతో పాటు ప్రజా ప్రతినిధుల సూచనల మేరకు నిర్మాణ పనులు చేపడతామని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ఎంపిపి గేదెల శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా తమకేమీ తెలియదన్నట్టు పెదవి విరవడం కొసమెరుపు.

విద్యుత్తు శాఖ తీరుపై సభ్యుల అసహనం

ప్రజాశక్తి - భోగాపురం

విద్యుత్ శాఖ అధికారులు పనితీరు సక్రమంగా లేదని, ఏ పని కావాలన్నా ఎస్టిమేట్లతో సరిపెడుతున్నారని విద్యుత్ శాఖ తీరుపై మండల ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఉప్పాడ అనూష అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సభలో ముక్తకంఠంతో విద్యుత్ శాఖ అధికారులు తీరు బాగోలేదని సభ్యులంతా సభకు తెలియజేశారు. పోలిపల్లి సర్పంచ్ కర్రోతు వెంకటరమణ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విషయంలో గత సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. ఎఒ హరికృష్ణ మాట్లాడుతూ 20వేల గోనె సంచులు అందుబాటులో ఉన్నాయని, 9,10 తేదీలలో వర్షం ప్రభావం ఉన్నందున వరి కోతలను ఆపాలని సూచించారు. ముంజేరు సర్పంచ్ పూడి నూకరాజు మాట్లాడుతూ సచివాలయాలలో హై వోల్టేజ్ వస్తుందని ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేకపోతుందని విద్యుత్ శాఖ అధికారులు నిలదీశారు. అనంతరం ఎంపిపి అనూష మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని సూచించారు. అనంతరం ఎంపిడిఒ 2022- 23, 23-24 అంచనాల బడ్జెట్‌ను ప్రవేశపెట్టడంతో సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిపసి పడాల మంజులత, వైసిపి మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ, వైస్ ఎంపిపిలు పడాల సత్యవతి, రావాడ బాబు, హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఉప్పాడ శివారెడ్డి, ఎంపిడిఒ డి బంగారయ్య, ఇఒపిఆర్‌డి సురేష్, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ వైకుంఠం నాయుడు, పిఆర్ డిఇ బంగారు నాయుడు, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి అనూష

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - గుర్ల

ఎస్.కోటలో జరిగిన ఎస్‌జిఎఫ్ త్రో బాల్ అండర్-14, 17 రాష్ట్ర స్థాయి పోటీలకు పెదబంటుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్ 17 విభాగంలో బి. దిలీప్, దుర్గారావు, దుర్గాప్రసాద్, ధనుంజయ, భార్గవి, సుస్మిత, అండర్ 14 విభాగంలో నిఖిల్ ఎంపికైనట్లు పాఠశాల పీడీ సత్తిబాబు, రూపాదేవి తెలిపారు. వీరంతా డిసెంబర్ 17,18,19 తేదీల్లో కడపలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వీరిని పాఠశాల హెచ్ఎం ప్రసాదరావు అభినందించారు.

సత్తా చాటిన విద్యార్థులు

గరివిడి : స్థానిక శ్రీ రామ్ జూనియర్ కాలేజీ విద్యార్థులు డిసెంబర్ 4, 5న చిత్తూరు జిల్లా రేనుగుంటలో జరిగిన స్కూల్ గేమ్స్ అండర్ 19 కుస్తీ పోటీలలో పాల్గొని రాష్ట్ర స్థాయిలో బంగారు పతకాలు సాధించారు. వి. లావణ్య, వి. మురళి కృష్ణ బంగారు పతకం సాధించి హర్యానాలో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను సెక్రటరీ అండ్ కరెస్పాండంట్ టి. కమలాకరరావు, అడ్వైసర్ బి. రవి, కాలేజ్ ప్రిన్సిపాల్ మజ్జి భాస్కరరావు, పీడీ బి. శ్రీనివాసరావు, సిబ్బంది గురువారం కళాశాలలో అభినందించారు.

గుర్ల: విద్యార్థులను అభినందిస్తున్న సిబ్బంది

.రాష్ట్ర స్థాయి పోటీలకు కోనాడ విద్యార్థులు

పూసపాటిరేగ: మండలంలోని కోనాడ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీకి ఎంపికైనట్లు పాఠశాల పీడీ కృష్ణారావు తెలిపారు. ఈ నెల 7న ఎస్.కోటలో జరిగిన జిల్లా స్థాయి త్రోబాల్ సెలక్షన్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. కోనాడ విద్యార్థులు అండర్ 14లో వి.ధనుష్, పి.శిరీష, అండర్ 17లో ఎస్.మనోహర్ రెడ్డి, పి.సాయిలిఖిత ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పివిఎస్ చలంతో పాటు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో మరింత మెరుగైన ప్రదర్శన ఇవ్వాలని ఆకంక్షించారు.

శృంగవరపుకోట : ఈ నెల 10న శనివారం ఉదయం పట్టణంలోని స్పార్టాన్ బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియంలో అండర్ -14,17,19 ఎస్‌జిఎఫ్ స్కూల్ గేమ్స్ బాలురు, బాలికలు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఈ ఎంపిక పోటీల ఆర్గనైజింగ్ కార్యదర్శి ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. ఈ ఎంపిక పోటీలు అండర్ -14,17 ఎస్‌జిఎఫ్ కార్యదర్శి ఎల్‌వి. రమణ, అండర్ -19 ఎస్‌జిఎఫ్ జిల్లా కార్యదర్శి పివిఎల్ఎన్. కృష్ణల ఆధ్వర్యంలో జరుగుతాయని చెప్పారు. పాల్గొనే క్రీడాకారులు ఎవరి బ్యాట్స్, మావిస్ -350 యోనెక్స్ షటిల్ కాక్స్ వారే తెచ్చుకోవాలన్నారు. క్రీడాకారులు వారు చదువుతున్న కాలేజ్ నుండి స్టడీ, 10వ తరగతి మార్క్ లిస్ట్ జెరాక్స్ తీసుకొని రావాలన్నారు. మరిన్ని వివరాలకు 7989199534ను సంప్రదించాలన్నారు. ఈ పోటీలలో పాల్గొనే వారికి స్నేహ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో భోజనాలను ఏర్పాటు చేస్తారని తెలిపారు.

గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మార్చేశారు: టిడిపి

విజయనగరం కోట : హరితాంధ్రను గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా చేసిన ఘనత వైసిపిప్రభుత్వానికే దక్కుతుందని తెలుగు యువత పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు వేమూరి చైతన్యబాబు మండిపడ్డారు. గురువారం అశోక్ బంగ్లాలో తెలుగు యువత నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మాదక ద్రవ్యాలు, డ్రగ్స్, గంజాయి విచ్చలవిడిగా దొరుకుతున్నాయని, దీనికి కారణం వైసిపి ప్రభుత్వమేనని అన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు మౌలిక వసతులు అభివృద్ధి చేసి అనేక పరిశ్రమలు తీసుకువస్తే, ఈ ప్రభుత్వ తీరు కారణంగా కొత్తగా ఒక్క పరిశ్రమ కూడా రాకపోగా ఉన్న పరిశ్రమలు కూడా వెనక్కి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. యువత ఉపాధి లేక ఒత్తిళ్లకు గురై మాదకద్రవ్యాల బారిన పడుతున్నారని అన్నారు. అటువంటి వారికి ఈ ప్రభుత్వం ఏం సమాధానం చెబుతుందని ఆవేదన వ్యక్తం చేశార.

ధాన్యం కొనుగోలు ఎక్కడ?

బాడంగి : వ్యవసాయ శాఖ అధికారులు ధాన్యం కొంటున్నట్టు ఫోటోలే తప్ప రైతుల దగ్గర పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు ఎక్కడా ప్రారంభించలేదని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు పండించే ప్రతి ధాన్యపు గింజ ప్రభుత్వం గోనె సంచులు ఇచ్చి స్వయంగా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. బాడంగి మండలం మల్లంపేట, పాల్తేరు గ్రామాల్లో ఆయన రైతులతో మాట్లాడారు. ఒకపక్క వరి చేలు కోసి పొలంలో ఉంచడం వలన ఎప్పుడు తుఫాను వస్తుందో అని భయంతో ఉన్నారని, ప్రభుత్వం రైతులనుంచి ప్రతి గింజా కొంటామని చెప్పడం మినహా కొనడం లేదని అన్నారు. ప్రభుత్వం వెంటనే రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయకపోతే వ్యవసాయశాఖ కార్యాలయాల వద్ద ఆందోళనలుచేస్తామని తెలిపారు.



రైతులతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

సంక్షేమ వసతి గృహాల్లో సౌకర్యాల కొరత

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సంక్షేమ వసతి గృహాలు అసౌకర్యాల నడుమ కొట్టిమిట్టాడుతన్నాయి. విద్యార్థులకు కల్పించాల్సిన కనీస అవసరాలు నీరు, మరుగుదొడ్లు, వసతి వంటి సౌకర్యాలు కూడా కల్పించడం లేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల మరుగుదొడ్లకు తలుపులు కూడా లేకపోవడం విచారకరం. దీంతో చాలా మంది ఆరుబయటే స్నానాలు చేస్తున్నారు. ఫలితంగా ఆరుబయట కూడా అపారిశుధ్యం తాండవించడంతో జ్వరాల బారిన పడుతున్నారు.

మండలంలోని అలుగోలు, బొప్పడాం, మొయిద బిసి సంక్షేమ వసతి గృహల్లో విద్యార్థులకు సౌకర్యాలు కొరత తీవ్రంగా వేధిస్తోంది. అలుగోలు వసతి గృహంలో గదులు చాలాక విద్యార్థులు ఇంకా పాత భవనంలోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. అక్కడ మరుగుదొడ్లకు కనీసం తలుపులు కూడా లేకపోవడంతో విద్యార్థులు మరిన్ని కష్టాల పడుతున్నారు. మండల కేంద్రంలో సాంఘిక సంక్షేమ వసతి గృహం కూడా సౌకర్యాల లేమితో కొట్టు మిట్టాడుతుందని చెప్పవచ్చు. వసతి గృహంలో ఉన్న విద్యార్థుల సంఖ్య కంటే ఎక్కువ హాజరు వేస్తున్నట్లు, మెనూ కూడా పాటించనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. భవనం మరమ్మతులకు గురికావడం, కిటికీలకు తలుపులు లేకపోవడంతో విద్యార్థులు చలి కాలం ఇబ్బందులు పడుతున్నారు. ఈ వసతి గృహాన్ని నాడు నేడులో భాగంగా బాగు చేస్తామని చెప్పినా ఇంత వరకూ ఆ పనులు జరగలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వసతిగృహాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలూ కల్పించాలని కోరుతున్నారు.

ఆరుబయట స్నానాలు చేస్తున్న వసతి గృహ విద్యార్థులు

తలుపులు లేని మరుగు దొడ్లు

In the Hounourable Court of the Senior Civil Judge, Vizianagaram
E.P.No. 18/2021 O.S.No. 328/2013

Between:
Keerthi Satyanarayanamma
....Decree Holder
And :
Bangaru Umavathi ....Judgement Debtor
To,
Bangaru Umavathi, W/o. Sattibabu, R/o Door.No.8-18/1-93, Pradeep Nagar, Vizianagaram.

నోటీసు

పై నెంబరు దావాలో కోర్టువారు జారి చేసిన డిక్రి అమలు కోరుతూ, డిక్రిహోల్డరు పైన తెలిపిన E.P. దాఖలు చేసియున్నారు. సదరు E.P. **తే12-12-2022దీ**న వాయిదా ఉన్నందున మీరు **ఉదయం 10-30 గంటల**కు పై కోర్టుకు హాజరు కావాల్సియున్నది. లేని యెడల సదరు E.P. మీ పరోక్షమున విచారించి తీర్మానం చేయబడునని తెలియజేయడమైనది.

S.A. Shahjahan
Advocate, Vizianagaram
Cell: 7386877335, 9550784079

In The Court Of The Senior Civil Judge :: Bhimavaram
E.P.No. 37/2020
In O.S.No. 169/2011

D.H.R.: Gadiraju Rama Krishnam Raju
J.D.R's.: Gadiraju Suryanarayana Raju (Died) & Others
4th JDR: Rudraraju Sowjanya @ Suseela, W/o. Rama Krishnam Raju, D.S.P., Vijayanagaram, Vijayanagaram Dist.

పై నెంబరు అమలు గ్రంధములో 4వ జె.డి.ఆర్.కు OR 21 R22 నోటీసులు అనేక పర్యాయములు రిజిష్టరు పోస్టు ద్వారాను తమ కోర్టు వారి ద్వారాను అనేక పర్యాయములు పంపించిననూ 4వ జె.డి.ఆర్. ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనియుండుట లేదు. కాబట్టి 4వ జె.డి.ఆర్.కు OR 21 R22 నోటీసులు అమలు నిమిత్తం **ది.28-12-2022న వాయిదా అయి ఉన్నది. సదరు తేదీన ఉదయం గం।। 10:30 ని।।లకు శ్రీ కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను.** లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

సాంబ్రాణి వెంకట సత్యనారాయణ
భీమవరం, డి.హెచ్.ఆర్. తరుపు అడ్వకేట్,
06-12-22. భీమవరం. సెల్: 99490 02289